

ఉపాధి అవకాశాలుండే..

స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌తోపాటు ఉపాధి అవకాశాలుండే విద్య అవసరమని ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు.

- 8లో ▸



'భూ భారతి' దరఖాస్తులను..

భూ భారతి దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించాలని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు.

- 8లో ▸



వాతావరణం

ఉదయం చల్లని ఆహ్లాదకరమైన గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది.

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన జిల్లా కాంగ్రెస్ నాయకులు



నిజామాబాద్ సిటీ: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కలిశారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి జిల్లాలోని పరిస్థితులను వివరించారు. నుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కేశ వేణు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్, క్రమశిక్షణ సంఘం సభ్యుడు జీవీ రామకృష్ణ తదితరులున్నారు.

యువతికి డెంగీ

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రానికి చెందిన 24 ఏళ్ల యువతి డెంగీ బారినపడి బోధన్‌లోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. సమాచారం అందుకున్న హెల్త్ సూపర్‌వైజర్ సునీత మంగళవారం ఆశవర్కర్లతో కలిసి బాధితురాలి ఇంటిని సందర్శించి పరిసరాలను శుభ్రం చేయించారు. డెంగీబారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, పాత టైర్లు, డ్రమ్ములు, కుండీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, డెంగీ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

మున్సిపల్ కార్పొరేషన్ డీసీగా రవిబాబు

- అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్‌గా ఎంఏ నజీర్



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా రవిబాబు నియమితులయ్యారు. అలాగే పలువురి బదిలీలు జరిగాయి. నూతన డీసీగా రవిబాబు మంగళవారం సాయంత్రం బాధ్యతలు తీసుకున్నారు. రెవెన్యూ ఆఫీసర్లుగా ఉన్న ఎంఏ నజీర్, ఖదీర్‌పాషా మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్లుగా పదోన్నతి పొందారు. ఖదీర్ పాషా సిరిసిల్లాకు, అనిత జవహర్‌నగర్‌కు బదిలీ అయ్యారు. వీరితోపాటు నలుగురు జూనియర్ అసిస్టెంట్‌లు శామయ్య, కె.స్వప్న, ఎస్.అశ్విని, జి.రాజేశ్వరి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. వీరందరికీ నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లోనే పోస్టింగ్‌లు ఇచ్చారు. వీరితో పాటు సీనియర్ అసిస్టెంట్‌లుగా మెట్‌పల్లి నుంచి బి.దిలీప్, ఆర్మూర్ నుంచి బి.మోహన్ నిజామాబాద్ కార్పొరేషన్‌కు వచ్చారు.

13 మంది హెచ్‌ఎంలకు మెమోలు

నిజామాబాద్‌అర్బన్: జిల్లాలోని 13 మంది ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ మంగళవారం మెమోలు జారీ చేశారు. గత శుక్ర, శనివారం 13మంది ప్రధానోపాధ్యాయులు మధ్యాహ్న భోజనానికి సంబంధించి వివరాలను నమోదు చేయకపోవడంతో చర్యలు తీసుకున్నారు. తక్షణమే వివరణ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనంలో ఎంత మంది విద్యార్థులు భోజనం చేశారు. పాఠశాల విద్యార్థుల సంఖ్య ఆ రోజు భోజనం వివరాలను తక్షణమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉండగా, 13 మంది హెచ్‌ఎంలు నిర్లక్ష్యం చేయడంతో మెమోలు ఇచ్చారు.

కలిసి పోరాడితే డ్రైపోర్టు సాధ్యం

- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ముందుకెళ్దాం
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో కేంద్రమంత్రి అమిత్‌షాను కలుద్దాం
- జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటైతే రూ.వెయ్యి కోట్ల ఎకానమీ
- విలువ ఆధారిత పంట ఉత్పత్తులతో రైతులే ఎగుమతిదారులవుతారు
- 'సాక్షి' చర్చ వేదికలో వక్తల అభిప్రాయాలు
- పాల్గొన్న చాంబర్ ఆఫ్ కామర్స్, రైతు ఉత్పత్తిదారుల సంస్థల బాధ్యులు
- జేఏసీ ఏర్పాటుకు తీర్మానం



సాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చగోష్టిలో మాట్లాడుతున్న చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు నల్ల దినేశ్‌రెడ్డి, పాల్గొన్న వక్తలు

సాక్షి డిబేట్

నిజామాబాద్‌లీగల్/డొంకేశ్వర్: జిల్లాలో డ్రైపోర్టు సాధించేందుకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదామని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల బాధ్యులు, ఇతర సంఘాల ప్రతినిధులు నిర్ణయించారు. ఇందుకోసం ఐక్య కార్యాచరణ కమిటీ ఏర్పాటు చేసుకుని ముందుకు వెళ్లేందుకు తీర్మానం చేశారు. ఇందులో భాగంగా ఈ నెల 29న కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్‌షాను కలిసి విన్నవించేందుకు సిద్ధమయ్యారు. తర్వాత ఢిల్లీ వెళ్లి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ప్రకాష్ హ్యుందయ్ షోరూంలో నిజామాబాద్ జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు కోరుతూ చర్చ వేదిక జరిగింది. నిజామాబాద్, జగిత్యాల, నిర్మల్, ఆదిలాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల్లో పండుతున్న పసుపు, ధాన్యం, సోయా, మొక్కజొన్న, ఎర్రజొన్న, పత్తి, మామిడి పంటలకు అదనపు విలువ జోడించడంతోపాటు సిరిసిల్ల జిల్లాల్లో నేతన్నల ఉత్పత్తులను అంతర్జాతీయ మార్కెట్‌కు నేరుగా ఎగుమతి చేసేందుకు డ్రైపోర్టుతో అవకాశం కలుగుతుందని, రూ.వెయ్యి కోట్ల ఎకానమీ సాధ్యమవుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. అన్ని రంగాల్లో వివిధ యూనిట్లు ఏర్పాటై యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. డ్రైపోర్టు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచేందుకు కచ్చితమైన కార్యాచరణ రూపొందించుకుని ముందుకెళ్లాలని తీర్మానం చేశారు. చర్చ వేదిక సమన్వయకర్తగా సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తుమాటి భద్రారెడ్డి వ్యవహరించారు.

కంటెయినర్ డిపో ఏర్పాటు చేయాలి



జిల్లాలో డ్రైపోర్టు, కంటెయినర్ డిపో ఏర్పాటు చేస్తే జిల్లాలో అభివృద్ధి వేగవంతమవుతుంది. దీనికోసం ఆరేళ్లుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో పోరాటం చేస్తున్నాం. జిల్లాలో బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్‌ను చాంబర్ ఆఫ్ కామర్స్ పోరాటం చేసి సాధించింది. ప్రస్తుతం బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమిద్దాం. – **జగదీశ్వర్‌రావు,** అధ్యక్షులు, నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్

అన్ని పార్టీలు మద్దతు తెలపాలి



ఇందూరులో డ్రైపోర్ట్ ఏర్పాటు కోసం చాంబర్ ఆఫ్ కామర్స్ చేస్తున్న పోరాటానికి రాజకీయాలు అతీతంగా మద్దతు తెలపాల్సి ఉంది. దీని సాధన కోసం తెలంగాణ ఉద్యమం స్ఫూర్తిగా ముందుకెళదాం. డ్రైపోర్ట్ ఏర్పాటైతే జిల్లా అభివృద్ధికి టర్నింగ్ పాయింట్ అవుతుంది.

– **రాజశేఖర్‌రెడ్డి,** రియల్ ఎస్టేట్ వ్యాపారి

రైతులే అంతర్జాతీయ ఎగుమతి చేసుకోవచ్చు



వ్యవసాయ ఉత్పత్తుల్లో దేశంలోనే పేరు గాంచిన ఇందూరు జిల్లాలో డ్రైపోర్టు అత్యవసరం. రైతులే అంతర్జాతీయ ఎగుమతిదారులుగా తయారవుతారు. దేశంలోనే భారీ పసుపు మార్కెట్లలో నిజామాబాద్ మొదటి వరుసలో ఉంది. పంట ఉత్పత్తులకు అదనపు విలువ జోడించకుండా వచ్చిన వెంటనే అమ్మేస్తే రైతులకు ఆశించిన ధర దక్కడం లేదు. జక్రాన్‌పల్లి మండలంలో ఐదు గ్రామాల రైతులం కలిసి తెలంగాణలోనే మొదటి పసుపు క్లస్టర్‌ను ఏర్పాటుచేశాం. రైతులు పండించిన పంటతో ఆర్గానిక్ పసుపు పౌడర్‌ను తయారుచేసి విక్రయిస్తున్నాం. డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే రైతులకు మరింత మేలు చేకూరుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేందుకు యువతకు మరిన్ని అవకాశాలు సృష్టించబడతాయి. గల్ఫ్ దేశాలకు వెళ్లి పనిచేసే అవసరం ఉండదు. ఆత్మనిర్భర్ భారత్ కింద జిల్లాకు డ్రై పోర్టును సాధించుకోవాలి. కేంద్ర ప్రభుత్వ సాయాన్ని కోరుదాం. అందరం పిడికిలి బిగిస్తేనే డ్రైపోర్టు కల సాకారమవుతుంది. పార్టీలకతీతంగా ముందుకెళదాం. ఎంపీ అర్వింద్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌ను కలుద్దాం. – **పాట్కూరి తిరుపతిరెడ్డి,** పసుపు ఎఫ్‌పీవో చైర్మన్

కేంద్రం అంగీకరిస్తుందనే ఆశ ఉంది



డ్రైపోర్టు కోసం ఈ నెల 29న జిల్లాకు రానున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను కలిసి విన్నవిద్దాం. ఈలోపు సమగ్రంగా ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలి. ఎంపీ అర్వింద్ సహాయాన్ని కోరుదాం. కేంద్ర ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుపై సానుకూలంగా ఉన్న నేపథ్యంలో ఇందూరులో డ్రైపోర్టు ఏర్పాటుకు అంగీకరిస్తుందనే ఆశ ఉంది. చర్చవేదికను ఏర్పాటు చేసిన 'సాక్షి' యాజమాన్యానికి అభినందనలు.

– **శ్రీనివాస్,** చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గ సభ్యుడు

డ్రైపోర్టుకు అన్నివిధాలుగా అనుకూలం



డ్రైపోర్టు ఏర్పాటుకు నిజామాబాద్ జిల్లా అన్ని విధాలుగా అనుకూలంగా ఉంది. వ్యవసాయ ఆధారిత జిల్లాలో తగినవిధంగా పరిశ్రమలు లేకపోవడంతో రైతులు పండించిన పంటలకు ఆశించిన ధరలు దక్కడం లేదు. గతంలో జిల్లాలో 85 వేల ఎకరాల్లో పసుపు, 45 వేల ఎకరాల్లో చెరుకు సాగయ్యేది. తగిన మార్కెటింగ్ వ్యవస్థ, ఎగుమతులకు అవసరమైన సదుపాయాలు లేకపోవడంతో పసుపు సాగు తగ్గిపోగా, చెరుకు సాగు లేకుండా పోయింది. అన్ని వ్యాపారాలు దెబ్బ తిన్నాయి. నాణ్యమైన పంటలు పండించే రైతులున్న జిల్లాలో డ్రైపోర్టు అత్యవసరం. జిల్లా కేంద్రంగా చుట్టుపక్కల జిల్లాల నుంచి పంట, ఇతర ఉత్పత్తులు ఎగుమతి చేసుకోవచ్చు. జిల్లాకు రావాల్సిన ఎయిర్‌పోర్టు, రైల్వే ప్రాజెక్టు, పెద్ద పరిశ్రమలు కలగానే ఉన్నాయి. వీటిని సాధించడంలో నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఇప్పుడు కనీసం డ్రై పోర్టు ఏర్పాటు చేసినా జిల్లా ఎంతగానో అభివృద్ధి చెందుతుంది. రవాణా సౌకర్యానికి అనుకూలంగా ఉన్న హైవే పక్కన డ్రైపోర్టు పెడితే బాగుంటుంది. పంట ఉత్పత్తులు నిల్వ చేసుకుని మంచి ధర వచ్చినప్పుడు ఎగుమతి చేసుకోవచ్చు. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. డ్రైపోర్టు కోసం గతంలో కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంత్‌రెడ్డిలను కలిసి వివరించినా ఫలితం లేదు. ఇప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెద్దాం. సంకల్ప బలంతో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లాలి. డ్రైపోర్టు ఏ ఒక్కరి కోసమో కాదు, ముందు తరాల భవిష్యత్తు కోసం.

– **నల్ల దినేశ్‌రెడ్డి,** చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు

అన్ని రంగాల్లో అభివృద్ధి



ఉత్తర, దక్షిణ భారతదేశం మధ్యలో జిల్లా ఉంది. డ్రైపోర్టు ఏర్పాటైతే అన్ని రంగాల అభివృద్ధి ఉరకలెత్తుతుంది. వ్యాపార, వాణిజ్య, రాజకీయ, ఉద్యోగ రంగాల వారు, యువత డ్రైపోర్టు అవసరాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బలంగా తెలిపేలా కార్యక్రమాలు చేపట్టాలి. జిల్లా నుంచి నేరుగా ఎగుమతులు, దిగుమతులు జరిగితే రాష్ట్ర, దేశ అభివృద్ధిలో ఈ ప్రాంతం భాగస్వామ్యం ఎలా ఉంటుందో వివరించాలి.

– **ధాత్రిక రమేశ్,** సామాజిక సేవకుడు, గోసేవకుడు

సముద్రమార్గం అనుసంధానం



భూపరివేష్టిత రాష్ట్రంగా ఉన్న తెలంగాణలో సారవంతమైన భూములున్నాయి. జీఎస్‌డీపీని భారీగా అందించగలిగే సత్తా ఉన్న ఉత్తర తెలంగాణలోని ఇందూరు జిల్లాలో డ్రైపోర్టు ఏర్పాటు చేయాలి. ఈ జిల్లాకు రోడ్డు, రైలు మార్గం అనుసంధానంగా ఉన్నప్పటికీ సముద్రతీరం లేనందున డ్రైపోర్టు అత్యావశ్యకం. దీంతో నేరుగా సముద్రమార్గంతో సైతం అనుసంధానం అవుతుంది.

– **కమల్ కిషోర్ ఇనాని,** కార్యదర్శి, చాంబర్ ఆఫ్ కామర్స్

గేట్‌వేగా జిల్లా..



ఉత్తర, దక్షిణ భారతదేశానికి గేట్‌వేగా జిల్లా ఉంది. డ్రై పోర్టు ఏర్పాటు చేస్తే వ్యాపారాలు మరింత వృద్ధి చెందుతాయి. 1980–90లలో నిజామాబాద్ వ్యాపారులు వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు 20 టన్నుల సామర్థ్యం కలిగిన రైల్వే గూడ్స్ ర్యాక్‌లను బుక్ చేసుకునేవారు. ఇప్పుడు పెద్ద మొత్తంలో ఎగుమతి చేస్తేనే రైల్వే శాఖ అవకాశం కల్పిస్తోంది. డ్రైపోర్ట్ వస్తే 24 టన్నుల కంటెయినర్‌లను బుక్ చేసుకునే అవకాశం ఉంటుంది.

– **హితేన్ భీమాని,** కోశాధికారి చాంబర్ ఆఫ్ కామర్స్

పార్టీలకతీతంగా పోరాడుదాం



డ్రైపోర్టుతో జిల్లాలో అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయి. పార్టీలకతీతంగా డ్రైపోర్టు సాధనకు పోరాటం చేయాల్సిన సమయం వచ్చింది. జిల్లాకు రావాల్సిన డ్రైపోర్టును నల్లగొండకు తరలించుకుపోయారు. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు గేమ్ ఛేంజరైన డ్రైపోర్టును ఇందూరులో ఏర్పాటు చేసేందుకు బలమైన వాదనను కలసికట్టుగా వినిపిద్దాం. రైతులు, యువత భాగస్వాములు కావాలి. – **శివాజీ లక్ష్మణ్ పాటిల్,** వ్యాపారి

ఉత్సాహంగా రైతు సంబురం

డిచ్‌పల్లి: రైతు విజయోత్సవ కార్యక్రమం జిల్లాలో ఉత్సాహభరిత వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించారు. వానాకాలం–2025 సీజన్‌కు సంబంధించి ముందస్తు పంట పెట్టుబడి సాయం కింద రైతు భరోసా నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసిన సందర్భంగా మంగళవారం రైతు సంబురాలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా రైతు వేదికల వద్దకు అన్నదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొన్నారు. రైతు భరోసా నిధులు తొమ్మిది రోజుల వ్యవధిలోనే పూర్తి స్థాయిలో బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. డిచ్‌పల్లి మండలం యానంపల్లి రైతు వేదిక లో ఆదర్శ రైతులతో కలిసి కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సీఎం ప్రసంగాన్ని తిలకించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి సుధామాధురి, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



యానంపల్లి రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగం వింటున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

అందుబాటులో ఎరువులు, విత్తనాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జూన్, జూలై నెలలకు సరిపడా నిల్వలున్నాయని, ఎక్కడా రైతులకు కొరత లేకుండా అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు.ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎరువులు, విత్తన విక్రయ కేంద్రమైన గ్రోమోర్ సెంటర్ తోపాటు డిచ్‌పల్లి సహకార సొసైటీ గోదాము (యానంపల్లి)ను కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్, బిల్ బుక్‌లను, విత్తన బస్తాలపై లాట్ నంబర్, ఎమార్పీ ధర, బ్యాచ్ నంబర్, గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్, ఈ–పాస్ నమోదు వివరాల్లో తేడా ఉండొద్దని కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఎరువులు, విత్తన విక్రయ దుకాణాలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరాస్వామి, డిచ్‌పల్లి తహసీల్దార్ సతీశ్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారిణి సుధామాధురి, సొసైటీ చైర్మన్ రాంచందర్‌గౌడ్, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలసాని శ్రీనివాస్, సొసైటీ సీఈవో ఒన సాయిలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.



యానంపల్లిలోని సొసైటీ గోదాములో ఎరువుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

భారీ యంత్రాలు పసుపు రైతులకు భారమే..

- కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వని రాష్ట్ర ప్రభుత్వం
- యంత్రాల కొనుగోలుకు ఆసక్తి చూపని పసుపు రైతులు
- సుమారు 20 మందికే పరిమితమైన భారీ యంత్రాలు

ఆర్మూర్: వ్యవసాయ యాంత్రీకరణకు 2025–26లో రూ.104 కోట్లు కేటాయించినట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల ప్రకటించారు. రైతులకు ఉపయోగకరమైన, డిమాండ్ ఉన్న పరికరాలను గుర్తించి సబ్సిడీపై రైతులకు అందించాలని మంత్రి అధికారులకు సూచించారు. అయితే పసుపు సాగుకు అవసరమైన భారీ యంత్రాలకు సబ్సిడీ వర్తింపజేయకపోవడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. తమకు అవసరమైన యంత్రాలపై సబ్సిడీ ఇవ్వడం లేదని పసుపు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వేలాది మంది రైతులు సుమారు 25 వేల హెక్టార్లలో పసుపు సాగు చేస్తున్నారు. కానీ యంత్రాల సాయంతో సాగు చేస్తున్న వారి సంఖ్య మాత్రం 20కి మించ లేదు. యంత్రాలను కొనుగోలు చేసిన రైతులు వ్యవసాయ కూలీల ఖర్చులను తగ్గించుకుంటున్నారు. యంత్రాల సాయంతో పసుపు సాగు పనులు చేస్తున్న రైతులకు ఎకరాకు సుమారు రూ.లక్షల వరకు ఖర్చవుతుండగా, యంత్రాలు లేని రైతులకు రూ.లక్షా యాభైవేల వరకు అవుతోంది. యంత్రాల కొనుగోలుకు లక్షల రూపాయలు అవసరం కావడమే అందుకు కారణం. సీజనల్ వారీగా అవసరం ఉన్న పరికరాలను పెద్ద రైతుల నుంచి అద్దెకు తెచ్చుకుని పని పూర్తి చేసుకుంటున్నారు.



పసుపు విత్తనం విత్తే యంత్రం



పసుపు కొమ్మును ఉడకబెట్టే బ్రాయిలర్

అవసరమయ్యే యంత్రాలు..

పసుపు సాగులు భాగంగా వ్యవసాయ క్షేత్రాన్ని సిద్ధం చేసుకోవడానికి ట్రాక్టర్, కల్టివేటర్, బెడ్ మేకర్, విత్తనాలు విత్తడానికి ప్లాంటర్, కలుపు తీయడానికి మినీ పవర్ టిల్లర్, పంట తవ్వకానికి టర్మరిక్ డిగ్గర్, కొమ్ము ఉడకబెట్టేందుకు బాయిలర్, పాలిషర్ వంటి యంత్రాలు ఉపయోగకరంగా ఉంటాయి. వీటిలో ట్రాక్టర్, కల్టివేటర్ మినహా ఇతర ఏ యంత్రాలకూ రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడం లేదు.



ఇతర రైతులకు ఇస్తున్నా



రూ.లక్షలు వెచ్చించి పసుపు సాగుకోసం అవసరమయ్యే యంత్రాలను కొనుగోలు చేశా. గ్రామానికి చెందిన వారితోపాటు ఇతర గ్రామాల రైతులకు యంత్రాలను ఇస్తున్నా. పెట్టుబడి వ్యయం తగ్గి వారు లాభపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ అందించి యంత్రాలను రైతులకు చేరువ చేయాలి.

– **నలిమెల చిన్నారెడ్డి,** రైతు, మగ్గిడి, ఆర్మూర్ మండలం

సబ్సిడీ ఇవ్వాలి



రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహిస్తూ పసుపు సాగుకు ఉపయోగించే యంత్రాలన్నింటికి సబ్సిడీ ఇవ్వాలి. దీంతో సన్న, చిన్నకారు రైతులు సైతం యంత్రాలను కొనుగోలు చేసి ఉపయోగించడం ద్వారా పెట్టుబడి వ్యయం తగ్గి ఆర్థికంగా లాభపడతారు. పసుపు రైతులపై ప్రభుత్వం దృష్టి సారిస్తే పంట సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.

– **పెద్దకాపు రాజు,** రైతు, పెర్కిట్, ఆర్మూర్ పట్టణం

క్లుప్తంగా

ధూపదీప నైవేద్య దరఖాస్తుల పరిశీలన



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని దేవాదాయ ధర్మాదాయశాఖ జిల్లా కార్యాలయంలో మంగళవారం ధూపదీప నైవేద్యం పథకానికి వచ్చిన అర్జీలను జిల్లా ఎండోమెంట్ సహాయ కమిషనర్ విజయ రామరావు పరిశీలించారు. నాలుగు రోజులలో అర్చకులకు మౌఖిక పరీక్ష నిర్వహించి నివేదిక ఇవ్వవలసినదిగా కార్యనిర్వాహణాధికారులకు, పరిశీలకులకు, విజయ రామారావు సూచించారు. మొత్తం 97 అర్జీలను పరిశీలించాలని ఆయన కోరారు. జిల్లాలోని వివిధ ఆలయాలకు చెందిన కార్యనిర్వహణ అధికారులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో ఉదయం విద్యుత్ సరఫరా అవుతున్న కరెంట్ తీగలు ఒక్కసారిగా తెగి రోడ్డుపై పడ్డాయి. వెంటనే ఓ వాహనదారుడు గమనించి అటుపక్క ఎటువంటి వాహనాలు రాకుండా అడ్డుకున్నాడు. అనంతరం స్థానిక లైన్‌మన్ సంతోష్‌నాయక్‌కు సమాచారం అందించడంతో అతడు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. అనంతరం లైన్‌మన్ విద్యుత్ తీగలు సరిచేసి విద్యుత్ సరఫరా చేశారు. చెట్టు కొమ్మలు కరెంట్ తీగలపై పడటంతో తెగిపడ్డాయని విద్యుత్ సిబ్బంది తెలిపారు.

యాదవులపై కాంగ్రెస్ ప్రభుత్వం వివక్ష

- యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్



నిజామాబాద్‌నాగారం: గతంలో ఎన్నడూ లేని విధంగా కాంగ్రెస్ పార్టీ యాదవ కులస్తులను అణిచివేస్తుందని, ప్రభుత్వం వివక్ష చూపుతుందని రాష్ట్ర యాదవ సంఘం బీసీ జనసభ అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ విమర్శించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి యాదవులను, మున్నూరు కాపులను ఇతర కులాలను అణిచివేస్తుందన్నారు. బీసీలను అణగదొక్కడమే సామాజిక న్యాయమా అంటూ ఆయన ప్రశ్నించారు. మంత్రివర్గంలో, కార్పొరేషన్స్‌లో, పార్టీ పదవుల్లో యాదవులకు అన్యాయం చేస్తుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సరైన గుణపాఠం చెప్పడానికి నిరసనగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ఈనెల 30న మహాధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ధర్నాకు యాదవ కులస్తులు భారీగా తరలిరావాలన్నారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, కన్వీనర్ బాపూరావు యాదవ్, సంఘ ప్రతినిధులు రాజన్న యాదవ్, జనార్ధన్ యాదవ్, లింగన్న యాదవ్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలుండే విద్య అవసరం



జాతీయ సదస్సులో సావనీర్ ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, తెయూ వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరి తదితరులు



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు, పత్ర సమర్పకులు

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి
- తెయూలో 'వికసిత్ భారత్–2047' జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): స్కిల్ బేస్డ్ ఎడ్యుకేషన్‌తోపాటు ఉపాధి అవకాశాలుండే విద్య అవసరమని, అలాంటి విద్యా విధానం అమలు చేయాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ (టీసీఏ) సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజ్ సెమినార్ హాల్‌లో 'వికసిత్ భారత్–2047, ట్రాన్స్‌ఫార్మటివ్ రోల్ అఫ్ కామర్స్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల ద్వారా సరైన మార్గదర్శనం చేయడానికి యూనివర్సిటీలు కృషి చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేలా చూస్తున్నారని, ఆయన ఆశయాలను మనం అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. నైపుణ్యం కలిగిన విద్య ఉన్న వారికి సముద్ర అంతర్భాగాల నుంచి ఆకాశం వరకు అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రపంచంతో పోటీపడే విద్యతోనే వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. తెయూ వీసీ యాదగిరిరావు మాట్లాడుతూ.. వికసిత్ భారత్ లక్ష్యంతో కో–ఆపరేటివ్ ఫెడరలిజం వల్ల అవినీతి తగ్గి ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. సదస్సు కార్యదర్శి రాంబాబు గోపిశెట్టి మాట్లాడుతూ.. జాతీయ సదస్సులో మానవ వనరుల నిర్వహణ, అకౌంటింగ్, ఆర్థికం, మార్కెటింగ్, పన్నులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్‌చెయిన్, బిగ్ డేటా, ఆటోమేషన్‌పై పరిశోధకులు, విద్యావేత్తలు, వివిధ విశ్వవిద్యాలయాలు, కళాశాలల నుంచి విచ్చేసి పత్ర సమర్పణ చేసినట్లు తెలిపారు. విదేశాల నుంచి 4, భారత్‌లోని 8 రాష్ట్రాల నుంచి 174 పత్రాలు వచ్చినట్లు తెలిపారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (ఐపీఈ) డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, తెలంగాణ కామర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పురుషోత్తమరావు, అధ్యక్షుడు చెన్నప్ప, జనరల్ సెక్రెటరీ రవికుమార్ జాస్తి, రిజిస్ట్రార్ యాదగిరి ప్రసంగించారు. అనంతరం సదస్సులో 'వికసిత్ భారత్–2047, ట్రాన్స్‌ఫార్మటివ్ రోల్ అఫ్ కామర్స్' సావనీర్‌ను అతిథులు ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, సదస్సు కన్వీనర్ శ్రీనివాస్, కో కన్వీనర్లు గంగాధర్, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కళాశాల మంజూరుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న బాలకిష్టారెడ్డి

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు అన్ని రకాల వసతులు ఉన్నాయని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కళాశాల మంజూరుకు కృషి చేస్తానని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి అన్నారు. తెయూలో జరిగిన జాతీయ సదస్సుకు హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు తగిన సౌకర్యాలు, ఫ్యాకల్టీ ఉందన్నారు. ఈమేరకు వీసీ యాదగిరిరావు, రిజిస్ట్రార్ యాదగిరిలతో కలిసి తాను క్యాంపస్‌లోని భవనాలను, వసతి సౌకర్యాలను పరిశీలించినట్లు తెలిపారు. అలాగే యూజీసీ ఆదేశాల ప్రకారం ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని యూజీ, పీజీ కళాశాలల్లో 20 శాతం స్కిల్ బేస్డ్ కోర్సులు ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, ఇతర టెక్నికల్ కోర్సులు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థికి స్కిల్ (నైపుణ్యం) అత్యంత అవసరమని, ఫస్ట్ లాంగ్వేజ్, సెకండ్ లాంగ్వేజ్ ఉన్నట్లే థర్డ్ లాంగ్వేజ్ ఇకనుంచి స్కిల్ కోర్సులు ఉండాలని ఆయన వివరించారు. అలాగే కళాశాలలు కంపెనీలతో ఎంవోయూ చేసుకుని ఉపాధి అవకాశాలు సృష్టించాలన్నారు. సిలబస్‌లో మార్పులు చేస్తున్నామని, ఇందుకు వేర్వేరు రెగ్యులేటరీ కమిటీలు అనుమతులు అవసరమన్నారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ యూనివర్సిటీల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల ఖాళీలను గుర్తించి రిక్రూట్‌మెంట్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు వినతి..



బాలకిష్టారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

తెలంగాణ యూనివర్సిటీకి ఇంజినీరింగ్ కళాశాల మంజూరు చేయాలని వర్సిటీ ఎస్‌ఎస్‌యూఐ నాయకులు కోరారు. ఈమేరకు వారు మంగళవారం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షు డు బానోత్ సాగర్ నాయక్, నాయకులు శ్రీనునాయక్, విజయ్, వెంకటేష్, నరేష్ తదితరులున్నారు.

విద్యా ప్రణాళిక లక్ష్యాలు సాధించాలి



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్: విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుదల లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎఫ్‌ఎల్‌ఎన్ (ఫౌండేషన్ లిటరసీ న్యూమరసీ), ఎల్‌ఐపీ (లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రోగ్రాం) రెండు విద్యా ప్రణాళికలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేసి లక్ష్యాలు సాధించాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఎంఈవోలకు సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన రుద్రూర్, కోటగిరి, పోతంగల్, వర్ని, చందూర్, మోస్రా మండలాల ఎంఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. 1వ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు చదవటం, రాయటం, గణిత పరిజ్ఞాన నైపుణ్యాలాభివృద్ధి ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రణాళిక లక్ష్యమన్నారు. విద్యాప్రణాళికల అమలును పర్యవేక్షించాలని సూచించారు. నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం 2వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల నిర్ధారణకు ఈ నెల 25 నుంచి 30 వరకు ప్రతి పాఠశాలలో బేస్‌లైన్ పరీక్షలు ఉంటాయని ప్రస్తావించారు. ఉపాధ్యాయుల ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

మట్టి వ్యాపారులకు చెక్



సాక్షి ఎఫెక్ట్..

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ నిలిచే ప్రాంతం (బాల్కొండ మండలం జలాల్‌పూర్ శివారు) లో ఎలాంటి అనుమతులు లేకుండా చేపడుతున్న మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకున్నారు. ఈ మట్టి దందాపై సోమవారం సాక్షి దిన పత్రికలో 'అనుమతులు లేవు.. పర్యవేక్షణ లేదు' అనే శీర్షికన వార్తా కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ప్రాజెక్ట్ ఏఈఈ రవి ఆధ్వర్యంలో అధికారులు రెండు పొక్లెయిన్లను పట్టుకుని బాల్కొండ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యూజీసీ నెట్ పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ డివిజన్‌లోని యూజీసీ నెట్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య మంగళవారం తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మల్టీ షిఫ్ట్ ప్రకారం పరీక్షలు జరుగనున్నట్లు ఆయన పేర్కొన్నారు. నగరంలోని అర్సపల్లి బైపాస్ రోడ్డులో గల పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా నిషేధిత ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ బీఎన్‌ఎస్‌ఎస్ 163 అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలోని అన్ని జిరాక్స్ సెంటర్‌లను ఈనెల 25 నుంచి 29 వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మూసివేయాలన్నారు.

చరిత్రకు సాక్షిగా నిలిచిన శివాలయం

మీకు తెలుసా?



ఆలయంలోని శివలింగం



బోధన్‌లోని ఏకచక్రేశ్వర శివాలయం

పట్టణంలోని అపురూపమైన ఏకచక్రేశ్వర శివాలయం చరిత్రకు సాక్షిగా నిలుస్తోంది. భక్తులు కోరిన కోర్కెలు తీరుస్తూ జిల్లాలోనే విశిష్టత కలిగిన ఆలయంగా ప్రసిద్ధి చెందింది.

- 13వ శతాబ్దంలో కాకతీయులు బోధన్ ప్రాంతాన్ని పాలించిన కాలంలో ఈ ఆలయాన్ని నిర్మాణం చేసినట్లు శివ లీలామృతం అనే ప్రాచీన సంస్కృత గ్రంథంలో పేర్కొనబడింది.
- కాకతీయ పాలనలో ముష్కరులు దక్షిణ భారతదేశ దండయాత్రకు పూనుకున్న సమయంలో ఆలయాన్ని రక్షించుకునేందుకు ఈ ప్రాంతం వారు మట్టితో ఆలయాన్ని కప్పివేసి ఉంటారని ప్రచారంలో ఉంది.
- 1959లో గుంటూరు వాస్తవ్యుడైన రామిరెడ్డి అనే వ్యక్తి బోధన్‌లో స్థిరపడటానికి ఒక మట్టి కోటను చదును చేస్తుండగా (పుష్య బహుళ అమావాస్య రోజు) ఈ ఆలయం బయల్పడినట్లు బోధన్ పూర్వీకులు చెబుతుంటారు.
- సముద్రంలో అరుదుగా లభించే ప్రత్యేకమైన సాలాగ్రామము శిలతో చేయబడిన శివలింగాన్ని ఇక్కడ ప్రతిష్ఠాపన చేయడం అత్యంత విశేషమైనది.
- ఆలయంలోని శివలింగానికి నిత్యం పూజలు చేసేవారికీ ధనధాన్యాలకు లోటు ఉండదని శివపురాణంలో ప్రత్యేకంగా చెప్పబడింది. అందుకు తగ్గట్టుగానే ఈ ప్రాంతంలో ప్రజలకు తిండికి, నీటికి కొదవుండదు.
- ఆలయ అభివృద్ధి కమిటీ పాలకవర్గం ఆధ్వర్యంలో శివరాత్రి, కార్తీకమాసం, శ్రావణ మాసంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలతో పాటు, భక్తులకు ప్రత్యేక వసతులు, సౌకర్యాలు కల్పిస్తున్నారు.

– బోధన్‌రూరల్

'భూ భారతి' దరఖాస్తులను పరిష్కరించాలి

- ఆగస్టు 15 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి
- భారీ వర్షాలకు ముందే ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్ పూర్తవ్వాలి
- ఆయిల్‌పామ్ పంట సాగు విస్తరణకు చర్యలు
- వీడియోకాన్ఫరెన్స్‌లో సీఎస్ రామకృష్ణారావు



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్: భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను పరిశీలించి ఆగస్టు 15 నాటికి సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కే రామకృష్ణారావు సూచించారు. మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన మాట్లాడారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం పాల్గొనగా.. వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌పామ్ పంట విస్తరణ, సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూ భారతి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. భారీ వర్షాలు కురవకముందే ఇందిరమ్మ ఇళ్ల గ్రౌండింగ్‌తోపాటు బేస్మెంట్‌స్థాయి వరకు పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి ఉచితంగా ఇసుక సరఫరా చేస్తూ, సీనరేజీ చార్జీలను కూడా ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పెండింగ్ పనులు లబ్ధిదారులు పూర్తి చేసుకునేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. లాభసాటి పంట అయిన ఆయిల్‌పామ్ సాగు విస్తరణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులను నియంత్రించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు సూచించారు. లక్ష్యం మేరకు వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటాలని మంత్రి సురేఖ ఆదేశించారు.

కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తున్నామని, ఇప్పటికే 19,490 ఇండ్లు కేటాయించగా, 15,834 మందికి ప్రొసీడింగ్స్ అందించామని, 7181 ఇళ్ల నిర్మాణాల గ్రౌండింగ్ పూర్తయ్యిందని వివరించారు. క్షేత్రస్థాయిలో పనులను పరిశీలిస్తూ లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నామని అన్నారు. అలాగే జిల్లాలో 7075 డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని సీఎస్‌కు తెలిపారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా, ట్రెయినీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డీఎంహెచ్‌వో రాజశ్రీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్స్ నియంత్రణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: డ్రగ్స్ నియంత్రణకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలని సీపీ పోతరాజు సాయిచైతన్య ఎస్సైలకు సూచించారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో మంగళవారం నిజామాబాద్ డివిజన్‌లోని పోలీసు అధికారులకు నేరాల నియంత్రణపై నెలవారి సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ.. వచ్చే ఆరు నెలల్లో ప్రతి ఎస్‌హెచ్‌వో లక్ష్యాలు పెట్టుకొని నేరాల నియంత్రణ కోసం ఒక ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌ల వారీగా పెండింగ్‌లో ఉన్న కేసులను క్షుణ్ణంగా సమీక్షించి, త్వరితగతిన దర్యాప్తు ముగించడానికి తగిన సూచనలు చేశారు. మహిళల భద్రత కోసం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, వారికి అన్ని రకాల భద్రతల విషయంలో ఎల్లప్పుడు సహకారం అందించాలని తెలియజేశారు. మట్కా, గ్యాంబ్లింగ్, గంజాయి మొదలగు చట్టవ్యతిరేక కార్యాకలాపాలపై ప్రత్యేకమైన 'నిఘా' ఏర్పాటు, లాడ్జీలలో ఎప్పటికప్పుడు ముమ్మరంగా తనిఖీలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎన్‌బీడబ్ల్యూఎస్‌పై ప్రత్యేకంగా డివిజన్ పరిధిలో టీమ్స్ ఏర్పాటు చేసి త్వరితగతిన ఎగ్జిక్యూట్ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో వాహనాల తనిఖీ చేసి, దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. డయల్ 100 ఫిర్యాదుల పట్ల త్వరితగతిన స్పందించాలన్నారు. నిజామాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ బస్వారెడ్డి, ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి



భిక్కనూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. భిక్కనూరు ఎస్సై అంజనేయులు తెలిపిన వివరాలు ఇలా.. మండల కేంద్రానికి చెందిన చెట్లపల్లి రవి (42) ఈనెల 14న తాటికొండ అశోక్ అనే వ్యక్తికి జ్వరం రావడంతో చికిత్స కోసం అతడిని బైక్‌పై ఎక్కించుకొని భిక్కనూరు ప్రభుత్వాస్పత్రికి బయలుదేరారు. మార్గమధ్యలో వారి బైక్‌ను కామారెడ్డి వైపు నుంచి భిక్కనూరుకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో రవికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం అతడిని హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ రవి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై వివరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య



వర్ని: మండలంలోని జాకోరా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వర్ని ఎస్సై మహేష్ తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన కమ్మరి సతీష్ (40) ఫొటో గ్రాఫర్‌గా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున అతడు ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగానే సతీష్ ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లింగంపేట మండలంలో..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని అయిలాపూర్ గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మున్నూరుపల్లి సాయిలు–అనసుజ దంపతులకు కూతురు, కొడుకు ఉన్నారు. కొడుకు మున్నూరుపల్లి అశోక్(22) ఇంటర్ వరకు చదివి, గొర్లను కాస్తున్నాడు. కొంత కాలంగా దుబాయి వెళ్తానని తల్లిదండ్రులకు చెప్పగా వారు వద్దని వారించారు. పెళ్లి చేసుకొమ్మని చెప్పగా తర్వాత చేసుకుంటానన్నాడు. మనస్తాపం చెందిన అశోక్ మంగళవారం ఉదయం తెల్లవారుజామున దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చేతికందిన కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. లింగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంపుసెట్ కేబుల్ వైర్లు చోరీ

వేల్పూర్: వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి దొంగలు పంటపొలాల వద్ద సుమారు 20 వ్యవసాయ పంపుసెట్‌ల కేబుల్ వైర్లు చోరీ చేశారని గ్రామ రైతులు తెలిపారు. ఒక్కో పంపు సెట్‌కు స్టాటర్ నుంచి జాయింట్ వరకు అయిదు నుంచి ఇరవై మీటర్ల వరకు కేబుల్ వైరు ఉంటుందన్నారు. వైరును కత్తిరించి ఒర్రెలో కాల్చి అందులో ఉండే కాపర్ వైరును తీసుకెళ్లినట్లు తెలుస్తోందన్నారు. ప్రతి రైతుకు సుమారు రూ.2వేల వరకు నష్టం వాటిల్లినట్లు వారు మంగళవారం తెలిపారు.

చదివింది పీజీ.. చేస్తోంది పారిశుధ్య పని

- తండ్రి స్థానంలో కార్మికురాలిగా చేరిక
- చదువుకు తగ్గ ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్న శ్యామల



మురికి కాలువను శుభ్రం చేస్తున్న శ్యామల

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : ఆమె ఉన్నత విద్యావంతురాలు.. పీజీ, బీఈడీ పూర్తి చేసింది. తండ్రి పారిశుధ్య కార్మికుడు.. ఆయన అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ పోషణకు కూతురు ఆ పనిలో చేరింది. వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి బల్దియా పరిధిలోని దేవునిపల్లికి చెందిన శ్యామల దేవునిపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. కామారెడ్డిలోనే ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. తర్వాత పీజీ, బీఈడీ కూడా చదివింది. శ్యామల తండ్రి నాగయ్య మూడు దశాబ్దాలపాటు పారిశుధ్య కార్మికుడిగా పనిచేశాడు. ఆయన అనారోగ్యానికి గురవగా.. 2021లో ఆయన స్థానంలో శ్యామలను కాంట్రాక్టు కార్మికురాలిగా ఉద్యోగంలో చేర్చుకున్నారు. కొద్దిరోజులకే శ్యామల తండ్రి నాగయ్య చనిపోయాడు. కాగా పీజీతో పాటు బీఈడీ చదివిన శ్యామల పారిశుధ్య కార్మికురాలిగా పనిచేయడానికి అనేక ఇబ్బందులు పడుతోంది. మురికి కాలువలు శుభ్రం చేయడం, రోడ్లు ఊడ్చడం, గడ్డి తీయడం వంటి పనులన్నీ చేయాల్సి ఉంటుంది. అప్పట్లో మున్సిపల్ మంత్రిని, ఉన్నతాధికారులను కలిసి తన చదువుకు తగ్గ ఉద్యోగం ఇప్పించాలని వేడుకుంది. అయినా ఎవరూ పట్టించుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తోంది. డ్రెయినేజీ లు శుభ్రం చేయడం మూలంగా ఆరోగ్యం కూడా దెబ్బతిందని శ్యామల ఆవేదన వ్యక్తం చేస్తోంది. తన చదువును చూసి మున్సిపాలిటీలో ఏదైనా రాత పని ఇప్పించాలని వేడుకుంటోంది.

ఖతార్‌లో ఆర్మూర్‌వాసి అదృశ్యం

- ఆచూకీ కనుక్కోవాలంటూ ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించిన కుటుంబం



నాగరాజు



ఫిర్యాదు చేస్తున్న కుటుంబ సభ్యులు

ఆర్మూర్: పట్టణంలోని కాశీ హనుమాన్ గల్లీకి చెందిన కానూర్ నాగరాజు ఖతార్‌లో అదృశ్యం అయ్యాడని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అతడి ఆచూకీ కనుగొనాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో తండ్రి కానూర్ నారాయణ వినతిపత్రం సమర్పించారు. ఆరు నెలల క్రితం నాగరాజు ఖతార్‌కు వెళ్లి విధుల్లో చేరాడని, గత నెల 26 నుంచి ఫోన్‌లో అందుబాటులో లేడని అతడి తండ్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఏదో క్రిమినల్ కేసు విచారణ కోసం పోలీసుల అదుపులో ఉన్నట్లు అనుమానంగా ఉందంటూ సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి చొరవ చూపాలని వారికి అభ్యర్థనలు పంపారు. ప్రవాసీ ప్రజావాణి కౌంటర్‌ను సందర్శించిన జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు శ్రీనివాసరెడ్డి, చిట్టిబాబులకు నారాయణ తన గోడును వెళ్లబోసుకున్నారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో పలువురికి జైలు

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియా పరిధిలో సోమవారం పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ముగ్గురు వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండటంతో వారిని పట్టుకున్నారు. వారికి మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ నిర్వహించి, సెంకడ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి ముగ్గురికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

బాల్కొండ: ముప్కాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా రాజస్థాన్‌కు చెందిన లారీ డ్రైవర్ విజయ్‌సింగ్ మద్యం తాగి పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో అతడిని మంగళవారం ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ ఎదుట హాజరుపర్చగా మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై రజనీకాంత్ తెలిపారు. సదరు లారీ డ్రైవర్ మద్యం తాగి లారీ నడుపుతూ జాతీయ రహదారి డివైడర్‌కు ఢీకొనడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోపాల్: మండలకేంద్రంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం తాగి వాహనం నడుపుతూ ఇద్దరు వాహనదారులు పట్టుబడ్డారు. దీంతో వారిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు.

తల్లిని హత్య చేసిన కొడుకుకు రిమాండ్

బోధన్‌రూరల్: బోధన్ మండలంలోని పెంటాకుర్దు గ్రామంలో తల్లిని హత్య చేసిన నిందితుడు (మృతురాలి కొడుకు) సురేష్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి మంగళవారం తెలిపారు. నిందితుడు హత్య కోసం ఉపయోగించిన గొడ్డలిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.